ప్రజాశక్తి



శనివారం 16 సెప్టెంబరు 2023 8 పేజీలు

శ్రీకాకుళం

అందరి సహకారంతో కేసుల
సత్వర పరిష్కారం



- న్యాయవాదుల పాత్ర కీలకం
- లోక్ అదాలత్‌తో మంచి ఫలితాలు
- చట్టాలపై అవగాహన అవసరం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ మౌలానా అహ్మద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

జిల్లాలో న్యాయవాదుల సహకారంతో పెండింగ్ కేసులను సత్వరం పూర్తి చేసి, న్యాయం అందించగలుగుతున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ మౌలానా అహ్మద్ అన్నారు. లోక్‌అదాలత్‌ల్లో అందరి సహకారం వల్లే మంచి ఫలితాలను సాధిస్తున్నామని చెప్పారు. ఎక్కువ మంది కక్షిదారుల మధ్య రాజీ ద్వారా

(మిగతా...2లో)

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- వర్షాభావ పరిస్థితులతో వేలాది ఎకరాల్లో వేయలేని పంటలు
- అపరిష్కృతంగానే షట్టర్ల సమస్య
- కరకట్టలు లేక వెంటాడుతున్న వరద ముప్పు
- ఇళ్ల బిల్లులు అందక అవస్థలు
- నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

(కథనం...2లో)

ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నవీన్

23 వరకు సెలవులో కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వ్యక్తిగత సెలవుపై ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు వెళ్లనున్నారు. అప్పటి వరకు ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

నేడు ఎన్‌వైకె వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా భారత పార్లమెంటు భవనంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనే యువతను ఎంపిక చేసే ప్రక్రియను చేపడుతున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్షేత్రస్థాయి ఎంపికను ఈనెల 16వ తేదీన ఆన్‌లైన్‌లో ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ప్రస్తుత ప్రపంచంలో గాంధీజీ ఆలోచనలు - విశ్వవ్యాప్తంగా దాని ప్రభావం' అనే అంశంపై యువతకు జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే యువత వయసు కనీసం 18 ఏళ్ల నిండి 29 ఏళ్ల లోపు ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాకు చెందిన యువతీ యువకులు మాత్రమే ఈ పోటీలో పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. యువత తమ ప్రసంగాలను హిందీ లేదా ఇంగ్లీషులో మాత్రమే చెప్పాలని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి అక్కడ్నుంచి జాతీయ స్థాయికి ఎంపికవుతారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన యువత అక్టోబరు రెండో తేదీన పార్లమెంటు భవనంలో నిర్వహించే గాంధీ జయంతోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయికి వెళ్లిన యువ బృందం ప్రధాని నరేంద్ర మోడీని కలుసుకుంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, ఆన్‌లైన్ లింక్ కోసం 9492118960 08942-222028 ఫోన నంబరును dyc.srikakulam@gmail.com మెయిల్ ఐడిని సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జిల్లాలో అనేక సమస్యలు పేరుకుపోయాయి. ప్రధానంగా వర్షాభావ పరిస్థితుల కారణంగా వేలాది ఎకరాల్లో రైతులు పంటలు వేయలేకపోయారు. వంశధార ఆయుకట్టులోని శివారు భూములకు సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయి. వంశధార కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగించలేదు. షట్టర్ల అవినీతిపై సిఐడి కేసు ఉండడంతో కొత్తవి అమర్చకపోవడంతో, పాడైన వాటితోనే నెట్టుకొస్తున్నారు. 2014-19 మధ్య కాలంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు రాక వేలాది మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటితో పాటు విద్యుత్, ఆర్ అండ్ బి రోడ్లు తదితర సమస్యలూ ఉన్నాయి. జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం నిర్వహించే జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు వీటిపై చర్చించి ఏం పరిష్కారం చూపుతారన్నది అంతా ఎదురుచూస్తున్నారు.

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడికాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందివ్వాల్సి ఉంది. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి.

వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతున్న పంటలు

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు 70 వేల ఎకరాల్లో రైతులు పంటలు వేయలేకపోయారు. అందులో వరి 59 వేల ఎకరాల వరకు ఉంది. పంటలు వేసినా సకాలంలో వర్షాలు పడకపోవడంతో పలుచోట్ల ఎండిపోతున్నాయి. జిల్లాలో ఆరు మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితుల జాబితాలో ఉన్నాయి. ఇచ్ఛాపురంలో నాలుగు మండలాలు, నందిగాం, జి.సిగడాం మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి.

వెంటాడుతున్న వరద భయం

కరకట్టలకు సంబంధించి కొత్త ప్రతిపాదనలను అధికారులు పంపి రెండేళ్ల గడుస్తున్నా ప్రభుత్వం తెలపలేదు. నిర్మాణ వ్యయం అధికంగా ఉండడంతో వైసిపి ప్రభుత్వం వాటిని ఉన్నపళంగా ఆపేసింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి నది పరివాహక ప్రాంతంలో ఐదు ప్రాంతాలను గుర్తించి, అక్కడ కరకట్టల నిర్మాణానికి రూ.13.5 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు. వంశధార వెంబడి మొత్తం 23 కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణం చేపట్టేందుకు రూ.130 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఈ రెండింటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఆమోదం తెలపలేదు.

షట్టర్ల సమస్యకు ఏం పరిష్కారమో?

నరసన్నపేటలో 2009లో నమోదైన సిఐడి కేసు 13 ఏళ్ల గడుస్తున్నా, కేసు తేలకపోవడంతో కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కార్యాలయాల్లో సుమారు రూ.నాలుగు కోట్ల నుంచి రూ.ఐదు కోట్ల విలువ చేసే షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వీటిని వేలం వేసి కొత్తగా కొనుగోళ్లు చేయాలంటే కేసుకు ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై జిల్లాకు చెందిన మంత్రులు దృష్టిసారిస్తే సమస్య పరిష్కారం కాగలదని అంతా భావిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణ బిల్లులు రాక ఇబ్బందులు

జిల్లాలో 2014 నుంచి 2018 వరకు నిర్మించిన ఎన్‌టిఆర్ గృహాలకు ఇప్పటికీ ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదు. ఇళ్ల కేటాయింపులు, నిర్మాణాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలతో ప్రభుత్వం వాటికి డబ్బులు ఆపేసింది. ఇళ్లను పరిశీలించి డబ్బులు చెల్లిస్తామని చెప్పినా, ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. జిల్లాలో సుమారు 19 వేల ఇళ్లకు సుమారు రూ.285 కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. డబ్బుల కోసం లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పోస్టల్ ప్రైవేటీకరణ తగదు

ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ జెఎసి నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పలాస

పోస్టల్ సేవలను ప్రైవేటీకరించడం తగదని అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులు అన్నారు. జెఎసి పిలుపు మేరకు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో శ్రీకాకుళంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం, పలాసలో కాశీబుగ్గ పోస్టాఫీసుల వద్ద ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోస్టుమెన్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబూరావు మాట్లాడుతూ ఉత్తరాల బట్వాడా కోసం నోడల్ డెలివరీ సెంటర్లను, హబ్‌లను ఏర్పాటు చేస్తూ పోస్టల్ సేవలను ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆలోచన సరికాదన్నారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది ఉద్యోగులు దేశవ్యాప్తంగా రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఎఫ్‌పిఇ జిల్లా కన్వీనర్ గణపతి, జిడిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.నందికేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా రద్దు చేసిన ఎన్‌ఎఫ్‌పిఇ, ఎఐపిఇయు గ్రూప్‌సి సంఘాల గుర్తింపు వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పలు కేడర్లను విలీనం చేసి పోస్టులను తగ్గించి ఉద్యోగులను ఒత్తిడికి గురిచేయడం సరికాదన్నారు. తక్షణమే తపాలా శాఖలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలన్నారు. జిడిఎస్ ఉద్యోగులకు సైతం ఎనిమిది గంటల పని కల్పించి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన ఎసిపి ప్రమోషన్, మెడికల్ ఇన్సూరెన్స్, సభ్యత్వ పరిశీలన ప్రక్రియ వెంటనే అమలు చేయాలని పోస్టల్ అండ్ ఆర్‌ఎంఎస్ పెన్షనర్స్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సబ్ పోస్టుమాస్టర్ ఎస్.గురుమూర్తి రమేష్, రాంబాబు, కామేశ్వరరావు, టి.ప్రకాశరావు, బి.తేజేశ్వరరావు, చాందిని పాత్రో తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన సమస్యలకు పరిష్కారం దిశగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమానికి భూ సమస్యలు, ఇళ్ల పట్టాలు, తాగునీరు, సిసి రోడ్లు తదితర సమస్యలపై 77 వినతులు వచ్చాయి. కలెక్టర్ వినతిపత్రాలను స్వీకరించి, ప్రతి సమస్యపై సంబంధిత అధికారుల వివరణలు కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవీన్ కుమార్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, టెక్కలి ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సీతారామ్మూర్తి, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, హౌసింగ్ పీడీ ఎన్.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, డిపిఒ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రాగోలు పరిధిలోని గ్రామాలకు ఈనెల 17న ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎపి ఇపిడిసిఎల్ ఇఇ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. లంకాం, వాకలవలస, గూడెం, జెమ్స్ ఆస్పత్రి ఏరియా, చంద్రయ్యపేట, బావాజీపేట, రాగోలుపేట, కొత్తరోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కేసుల సత్వర పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలను పరిష్కరించుకోవడానికి న్యాయవాదులు న్యాయస్థానాలకు, ప్రజలకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. కేసుల సత్వర పరిష్కారానికి ఇది దోహదపడుతోందని చెప్పారు. చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరమన్నారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

కేసుల సత్వర పరిష్కారంలో న్యాయవాదులు ఎలాంటి పాత్ర పోషించాల్సి ఉంటుంది?

న్యాయస్థానంలో పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాత్ర కీలకం. అనేక కారణాలతో ప్రజలు కోర్టును ఆశ్రయిస్తారు. వారి తరపున పనిచేసే న్యాయవాది కక్షిదారులకు న్యాయం అందించడానికి కృషి చేయాలి. క్షణికావేశంలో ఇరు వర్గాల మధ్య మనస్పర్థలు వచ్చినప్పుడు అంతరం పెరుగుతుంది. పలు కారణాలతో న్యాయస్థానాన్ని వారు ఆశ్రయించినప్పుడు ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కారం చూపాలంటే న్యాయవాదుల సహకారం అవసరం.

అపరిష్కృత కేసుల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

పెండింగ్ కేసులు పరిష్కారమైతే ప్రజలకు కోర్టులపై విశ్వాసం పెరుగుతుంది. జిల్లాలో గతంలో కంటే కేసులను సత్వరం పరిష్కరించడానికి ఉన్నత న్యాయస్థానాలు ఇచ్చిన సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకు జిల్లాలో న్యాయవాదుల నుంచి పూర్తి సహకారం అందుతోంది. న్యాయస్థానంలో తోటి అదనపు జడ్జిలతో పాటు కార్యాలయాల సిబ్బంది పూర్తిగా తోడ్పాటు అందిస్తున్నారు. దీనివల్ల దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో పురోగతి సాధించగలిగాం. ఇటీవలి కాలంలో సివిల్ కేసులపై దృష్టిసారించాం. ఎక్కువ కేసులు పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం. అందరూ సమిష్టిగా పనిచేస్తే ఎక్కువ కేసులు పరిష్కారమవుతాయి.

జిల్లాలో ఎన్ని కోర్టుల్లో న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి? కేసులు పెండింగ్‌లో ఉండడానికి ఖాళీలు ఏమైనా ప్రభావం చూపుతున్నాయా?

జిల్లాలో 13 కోర్టులు ఉన్నాయి. కొన్ని కోర్టుల్లో న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీల భర్తీకి సంబంధించి ఇప్పటికే హైకోర్టుకు విన్నవించాం. ఏడాది కాలంలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఖాళీ పోస్టులు భర్తీ అయితే కేసులు కూడా ఎక్కువ సంఖ్యలో పరిష్కారమవుతాయి.

కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జిల్లాలో కొత్తూరు, టెక్కలి, పొందూరు కోర్టులకు సొంత భవనాలు లేవు. వీటికి సంబంధించి హైకోర్టుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన తర్వాత భవన నిర్మాణాలు చేపడతాం. పాతపట్నం కోర్టు నూతన భవనానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతి రాగానే పనులు చేపడతాం. జిల్లా కేంద్రంలో అధునాతన సౌకర్యాలతో కోర్టు ప్రాంగణంలోనే నూతన భవనాన్ని నిర్మించుకున్నాం.

కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్‌లు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయి?

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటికే నాలుగుసార్లు జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహించాం. వీటి ద్వారా కేసుల పరిష్కారానికి రాజీ మార్గాన్ని ఎంచుకుని పరిష్కరించడానికి వీలవుతుంది. న్యాయవాదులు కక్షిదారులను సమర్థవంతంగా నచ్చజెప్పి ఇరువర్గాల మధ్య రాజీ కుదర్చడానికి తోడ్పాటునందిస్తున్నారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఇందుకోసం ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు ముందుకొచ్చి రాజీకి అంగీకరిస్తున్నారు. ఈనెల తొమ్మిదో తేదీన జిల్లాలో ఏర్పాటు చేసిన 21 లోక్ అదాలత్ బెంచ్‌ల్లో 9,255 కేసులు పరిష్కరించాం. ఈ అదాలత్‌లలో 4,84,09,661 మంది కక్షిదారులు భాగస్వాములై లబ్ధి పొందారు. పరిష్కారమైన 9,255 కేసుల్లో క్రిమినల్ కేసులు 9005, ప్రీ లిటిగేషన్ కేసులు 108, సివిల్ కేసులు 142 ఉన్నాయి.

జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవాదులకు మీరు ఇచ్చే సందేశం?

న్యాయవాద వృత్తికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ వృత్తిని స్వీకరించిన ప్రతి వ్యక్తి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుంది. ప్రస్తుత కాలంలో న్యాయవాద వృత్తిలోకి ఎక్కువ మంది వస్తున్నారు. న్యాయవాదులు వృత్తి గౌరవాన్ని ఎల్లప్పుడూ కాపాడాలి. సామాన్యులకు న్యాయం అందే విధంగా న్యాయవాదులు తోడ్పాటునందించడం వల్ల ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. తద్వారా న్యాయవాదులను వెతుక్కుంటూ ప్రజలు వస్తారు. జిల్లాలో న్యాయవ్యవస్థను సమర్థవంతంగా నడిపించడానికి తోడ్పాటు అందిస్తున్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు.

ఇంజినీర్ల సేవలు సమాజానికి అవసరం

జాయింట్ కలెక్టర్ నవీన్


టెక్కలి రూరల్ : ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జెసి నవీన్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

యవ ఇంజినీర్లు సమాజంలోని సమస్యలను గుర్తించి వాటికి సాంకేతిక ఆవిష్కరణలు జోడించి సమాజ సేవ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హితవు పలికారు. జాతీయ ఇంజినీరింగ్ డేను పురస్కరించుకుని టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగం శుక్రవారం సదస్సు నిర్వహించారు. ముందుగా 'ఈ' బ్లాకులో ఉన్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వతంత్ర పోరాట యోదులు, శాస్త్ర, సాంకేతిక రంగాల నిపుణుల త్యాగాలనుమనం నేడు వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఈ క్రాంపింగ్ భాగంగా 'ఆటోమేటిక్ సోలార్ వీడిరియల్' యంత్ర పరిశోధనకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎంఎస్ఎంఇ విభాగం ద్వారా రూ.12 లక్షలు మంజూరైన విద్యార్థులను, అలాగే కోడింగ్ యాక్రాన్ అనే అంశంపై నిర్వహించిన పోటీలో విన్నర్స్ ఆఫ్ ఐటికి చెందిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పలాస, ఆముదాలవలస ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.సుగుణాకరరావు, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజులు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జగదీశ్వరరావు

ఎచ్చెర్ల : విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో ఆయన చిత్రపటానికి డైరెక్టర్ ప్రొఫెసర్ జగదీశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సివిల్ విభాగపతి తేజ్‌కిరణ్, సివిల్ ఇంజినీర్ సురేష్, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఇఇ కె.తమ్మిరెడ్డి ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని హోటల్ గ్రాండ్‌లో జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్ టెక్నికల్ పర్సన్ ఆధ్వర్యాన ఇంజినీరింగ్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొని మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఓబులేసును సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, సుడాప్ మాజీ చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత



మాట్లాడుతున్న హారికాప్రసాద్


మాట్లాడుతున్న కమిషనర్ ఓబులేసు

చంద్రగుప్త, ప్లానింగ్ అధికారి రామ్మోహన్, క్రిడాయ్ ప్రెసిడెంట్ రమేష్ చక్రవర్తి, సెక్రటరీ ఎం.అదీపరెడ్డి, వెల్ఫేరు అసోసియేషన్ అధ్యక్షులు ముని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు దుంగ సుధాకరరావు, కార్యదర్శి ఎం.విజయకుమార్, వి.వెంకటరమణ, డి.వి.రమణ పాల్గొన్నారు.

భారతీయ ఇంజినీర్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన స్ఫూర్తిదాత భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని జిల్లా లైసెన్స్‌డ్ టెక్నికల్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హారికాప్రసాద్ అన్నారు. నగరంలోని గాంధీ మందిరంలో విశ్వేశ్వరయ్య 162వ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నిక్కు అప్పన్న, పైడి హరినాథరావు, అసోసియేషన్ సభ్యులు వాండ్రంగి శ్రీను, డి.ఎల్.ఎస్.మూర్తి, వి.శ్రీనివాసరావు, బి. సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, ఎం.రవికుమార్, బి.రమేష్, కె.కిరణ్, పందిరి అప్పారావు, మెట్ట అనంతంభట్లు, నక్క శంకరరావు పాల్గొన్నారు.

నగరంలోని మీనా కృష్ణ ప్లాజాలో జిల్లా లైసెన్స్ డ్ టెక్నికల్ పర్సన్స్ అండ్ కన్సల్టింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఇంజినీరింగ్ డే నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరరావు చిత్రపటానికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హారికాప్రసాద్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు వీరభద్రం, వెంకుమహంతి శ్రీనివాసరావు, బరాటం సత్యనారాయణ, సెక్రెటరీ వాండ్రంగి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ జి.శ్రీనివాస్, ట్రెజరర్ రమేష్, లయన్స్ శ్రీకాకుళం హర్షవల్లి అధ్యక్షులు కరణం శోభారాణి పాల్గొన్నారు. ముందుగా దర్శకురాలు సునీత ఆధ్వర్యాన చేసిన పలు సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంజినీర్స్ డే సందర్భంగా కమిషనర్ చల్లా ఓబ్లేసు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యమ్రంలో మున్సిపల్ ఇంజినీర్ గంగాథరరావు, హరిబాబు ఇంజినీరింగ్ విబాగం మేనేజర్ నాగరాజు, సంతోష్ పాల్గొన్నారు.

వంద మంది రక్తదానం

ఇంజినీర్స్ డే సందర్భంగా ఎపి ఇపిడిసిఎస్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన సూపరింటెండెంట్ ఇంజనీర్ దైవప్రసాద్ సమక్షంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వంద మంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిఇ పైడి యోగేశ్వరరావు, ఆపరేషన్ ఇఇ సత్తారు బయ్యన్నాయుడు, ఎడిఇ చల్లా వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, విష్ణుమూర్తి, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కవిటి: చవిద్యార్థి దశలో వచ్చే అనేక సృజనాత్మక ఆలోచనలతో కొత్తకొత్త ఆవిష్కరణలు చేపట్టవచ్చని జనసేన నాయకుడు, కళ్యాణి ఇండస్ట్రీస్ అధినేత లోల్ల రాజేష్ అన్నారు. స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో ఇంజినీర్స్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా రాజేష్‌ను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఎఒ బల్లెడ రాణి, ఉపాధ్యాయులు గీత, ప్రణీత పాల్గొన్నారు.


కవిటి : రాజేష్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

నేడు జాబ్‌మేళా

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఐసిఐసిఐ బ్యాంకు, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యాన నిర్వహించనున్న ఈ డ్రైవ్‌కి బిఎ, బి.కాం, బిఎస్‌సి చదివిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

'బొల్లినేనిలో...

శ్రీకాకుళం అర్బన్ : విశాఖలోని ఫార్మాస్యూటికల్ కంపెనీ 'ఫైజర్', లో మహిళా అభ్యర్థులకు శనివారం ప్రత్యేక జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ సంస్థ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియేట్ ఎంపిసి, బైపిసి పూర్తి చేసిన 18-20 మధ్య వయసు కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ జాబ్‌ను సాధించిన వారికి నెలకు రూ.12,500 వేతనంతో పాటు ఉచిత వసతి, భోజనం, రవాణా ఛార్జీలు చెల్లించనున్నట్టు తెలిపారు. ఇంటర్వ్యూ బొల్లినేని మెడ్ స్కిల్స్, జెమ్స్ హాస్పిటల్ అండ్ మెడికల్ కాలేజ్ క్యాంపస్, రాగోలు, నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు 7680940062, 7680945357 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

రూ.లక్ష విలువైన మందులు సీజ్


మందులను సీజ్ చేసిన డ్రగ్స్ ఎడి చంద్రరరావు

పాతపట్నం : మండలంలోని మండలం సిద్ధికు చెందిన తాళాబత్తుల గంగరాజు మందుల షాపులో అనుమతి లేని రూ.లక్ష విలువగల మందులను సీజ్ చేసినట్లు డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రరరావు తెలిపారు. గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం దాడి చేశామని అన్నారు. ఈ దాడిలో అనుమతులు లేని మందులను సీజ్ చేసి తరలించామని తెలిపారు. గంగరాజుపై కేసు నమోదు చేశామని అన్నారు. కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ యోగేంద్రరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న అరబిందో పరిశ్రమ ప్రతినిధులు

ప్రజాశక్తి- రణస్థలం

మొక్కలు నాటి కాలుష్యమవుతున్న పర్యావరణాన్ని కాపాడాలని పైడిభీమవరం అరబిందో ఫార్మా సెటికల్స్ హెచ్‌ఆర్ అండ్ హెడ్మిన్ కె.కమలాకర్ రెడ్డి అన్నారు. పచ్చదనాన్ని పెంచుదాం కాపాడదాం అనే నినాదంతో అరోబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యాన రణస్థలం నుంచి ఆనందపురం వరకు 16వ నంబరు జాతీయ రహదారి ఇరువైపులా 2,500 వివిధ రకాల మొక్కలను సామజిక బాధ్యతలో భాగంగా శుక్రవారం నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు నాటిన మొక్కలే వృక్షాలుగా ఎదిగి బావి తరాలకు కలుష్యరహిత సమాజాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటేందుకు ముందుకు రావాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి ఇంట్లో మూడు మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పిల్లలు పుట్టిన రోజులు సందర్భంగా పిల్లలతో ఇంటి ఆవరణలో, పొలాలు గట్లుపై, రహదారుల ఇరువైపులా మొక్కలు నాటించి పిల్లల్లోనూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అరబిందో పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

శ్రీకాకుళం లీగల్ : నగరంలోని బార్ అసోసియేషన్ నూతన భవనంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యాన శనివారం ఉదయం 11 గంటలకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.లక్ష్మీపతి, డి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యం-ప్రస్తుత పరిస్థితులు అనే అంశాంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, సీనియర్ న్యాయవాదులు, ఐలూ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న డాక్టర్ సురేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరానికి చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యాన ఆర్ట్స్ కాలేజి రోడ్‌లో మట్టి వినాయకుని ప్రతిమలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ మట్టి ప్రతిమలనే ఉపయోగించాలన్నారు. ప్లాస్టా పారిస్ వాడకం వల్ల అనేక రకాలైన ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వాతావరణంలో రసాయనిక రంగుల వల్ల వాయు కాలుష్యం, నీటి కాలుష్యం ఏర్పడుతుందన్నారు. రోగకారకాలైన వీటి వాడకాన్ని తగ్గించుకునేందుకు అతి పెద్దపండగైన వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలను వినియోగించాలన్నారు.

నదిలో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సోంపేట

మహేంద్రతనయ నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు పోత్రకొండ గ్రామానికి చెందిన తెంబూరు రంగారావు (51) అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు బారువ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రంగారావు గ్రామంలో సెలూన్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. గురువారం సాయంత్రం పని ముగించుకొని గ్రామ సమీపంలోని మహేంద్ర తనయ నదిలో స్నానానికి వెళ్లాడు. చాలాసేపటి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు నదిలో వెదికారు. అయినా ఫలితం కనిపించలేదు. శుక్రవారం ఉదయం నది ఒడ్డులో రంగారావు మతదేహాన్ని గ్రామస్తులు చూసి బారువ పోలీసులకు సమాచారం ఇచ్చారు. బారువ ఎస్ఐ చిరంజీవి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య సరోజిని, కూతురు రేణుక ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

జన సైనికులను నట్టేట ముంచిన పవన్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గురువారం రాజమండ్రిలోని సెంట్రల్ జైలులో చంద్రబాబుని కలిసి బయటకు వచ్చి వచ్చే ఎన్నికల్లో టిడిపితో కలిసి పోటీచేస్తామని ప్రకటించడంతో ఆయన అభిమానుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి నమ్ముకున్న జనసైనికులను నట్టేట ముంచారని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పవన్ పార్టీ పెట్టిందే చంద్రబాబు కోసమని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కెప్టెన్ రామారావు, సువ్వారి మనోహర్, బొడ్డేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు తప్పనిసరి

ప్రజాశక్తి – శ్రీకాకుళం

అన్ని స్కానింగ్ సెంటర్లలో సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పిసిపిఎన్‌డిటి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసిపిఎన్‌డిటి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. చట్టం గురించి గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ ఆడ, మగ పిల్లల నిష్పత్తి సమానంగా ఉండే విధంగా సభ్యులు తమ సూచనలు తెలియజేయాలని కోరారు. ఎఎస్‌పి జె.తిప్పేస్వామి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో రిజిస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఎడిఎంహెచ్‌ఒ అనురాధ మాట్లాడుతూ ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని స్కానింగ్ కేంద్రాల్లో బ్రోకర్ల ద్వారా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. దీనిపై దృష్టిసారించాలని డిఆర్‌ఒ ఆదేశించారు. సమావేశంలో డిసిహెచ్ భాస్కరరావు, ఆర్‌బిఎస్‌కె సిపి శ్రీదేవి, రిటైర్డ్ జడ్జి పి.జగన్నాథం, హెల్త్ ఎడ్యుకేటర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు



సదస్సులో మాట్లాడుతున్న రాధాకృష్ణ

ఎన్నికల్లో లబ్ధికే యుసిసి

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఏకరూప పౌరస్మృతి (యుసిసి) వీలు పడదని ప్రముఖ న్యాయవాది తర్లాడ రాధాకృష్ణ స్పష్టం చేశారు. ఐకమత్యం ప్రధాన సమస్యగా దేశ ప్రజలు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి తరుణంలో యుసిసి వంటి తొందరపాటు చర్యలు పరిస్థితులను జటిలం చేస్తాయని హెచ్చరించారు. ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యుసిసిని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందన్న భావన వ్యక్తం చేశారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం, యుటిఎఫ్ సంయుక్తంగా నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యూనిఫారం సివిల్ కోడ్ అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న యుసిసి సాధనకు విస్తృత సంప్రదింపులు చేసిన తర్వాత అన్ని మతాలు, కులాలు, ప్రాంతాల వారిని ఒప్పించడం ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. బలవంతంగా రుద్దడం సాధ్యం కాదన్నారు.

డాక్టర్ అదీబ్ హసన్ మాటాడుతూ ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని సంకుచిత దృక్పథంతో చేసే ఏ చట్టం ప్రజామోదం పొందదన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియ ఇలాంటి సున్నిత అంశాల్లో అనివార్యమన్నారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు మాట్లాడుతూ యుసిసిపై దేశంలో జరుగుతున్న చర్చ ద్వారా మతపరమైన పోలరైజేషన్‌తో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు హడావుడి చేస్తున్నారని చెప్పారు. ఇందులో ప్రజల ప్రయోజనాలు ఏవీ లేవని తెలిపారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు అధ్యక్షోపన్యాసం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ వక్తలను ఆహ్వానించారు. గణపతి వందన సమర్పణ చేశారు. సదస్సులో పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు, మహిళలు, ముస్లిం పెద్దలు, రిటైర్డ్ ఉద్యోగులు, పలు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









అనర్హులకు వికలాంగ పింఛన్లు

పిఎసిఎస్ ఛైర్మన్ సనపల నారాయణరావు



ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల మండలం, ఇబ్రహీంబాద్‌లో వికలాంగులకు అందజేసే పింఛన్లలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని పిఎసిఎస్ ఛైర్మన్ సనపల నారాయణరావు కోరారు. ఈ మేరకు వివరాలతో జిల్లా కలెక్టర్, ఆసుపత్రి సూపరెంటెండెంట్‌కు ఫిర్యాదు చేయడానికి వీరంతా సమాయత్తమవుతున్నారు. అర్హతలేని సుమారు 20 మందికి వికలాంగ పెన్షన్లు మంజూరయ్యాయని, కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి అర్హత లేని వారికి పెన్షన్ ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.30 వేల నుంచి రూ. 50 వేల వరకు ముడుపులుగా తీసుకుంటున్నారని ఆరోపించారు. అంగవైకల్యంతో బాధపడుతున్న వారు ఈ గ్రామంలో చాలామంది ఉన్నా వారికి ఇవ్వకుండా అన్ని అవయవాలు బాగున్నవారికి ఏ విధంగా ఇస్తున్నారని వీరు ప్రశ్నిస్తున్నారు. సదరం సర్టిఫికెట్ కోసం జిల్లా కేంద్ర వైద్య హాస్పిటల్ సిబ్బంది...అర్హులకు కాకుండా అనర్హులకు ఇవ్వడం వల్లే ఇలా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి నకిలీ వికలాంగుల పింఛన్ల జాబితాను త్వరలో జిల్లా కలెక్టర్‌కు, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరెంటెండెంట్‌కు సమర్పించి, ఇందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయడమే గాక, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రాపాకలో భూ సర్వే

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాకలో వైఎస్ఆర్ సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రోన్ కెమెరా ఎగురవేసి పలు భూముల సర్వేను చేపట్టారు. గ్రామంలో చేపడుతున్న ఈ భూ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రారంభిస్తున్న గిరిబాబు

కార్యక్రమంలో విఆర్ఒ బలరాం, అక్కమాంబ, సర్వేయర్లు స్వామి, ప్రసాదరావు, రాంబాబు, జయశ్రీ, డ్రోన్ సిబ్బంది పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటోను ముద్రించాలి

కొత్తూరు: కరెన్సీ నోట్లుపై అంబేద్కర్ బొమ్మను ముద్రించాలని మండల దళిత మహాసభ నాయకులు పడాల నాగ భూషణరావు, డి.గమ్మయ్య, బి.రామకష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిర్ల ప్రసాద్‌లు తహసీల్దార్ ఎం.చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, ద ప్రాబ్లెమ్ ఆఫ్ రూపీ అనే ఆర్థిక గ్రంథాన్ని రంచించి భారత రిజర్వు బ్యాంకు స్థాపనకు కారకుడైన అంబేద్కర్‌ను కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు.



యువ టూరిజం క్లబ్ ఏర్పాటు

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువ టూరిజం క్లబ్‌ను జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు పర్యాటక ప్రదేశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.ఉమాకుమారి, ఉపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, టి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణరావు













చంద్రబాబుపై కక్షసాధింపు తగదు



మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తున్న తిరుపతిరావు

మ్యాన్‌హోల్స్‌ను సరిచేయాలి

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ప్రధాన కూడళ్లలో రహదారుల మధ్యలో కాలువల మ్యాన్‌హోల్స్‌ను సరిచేయాలని సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు పొట్టిశ్రీరాములు కూడలి వద్ద శుక్రవారం మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మ్యాన్‌హోల్ ఉండే ప్రదేశంలో గోతులు ఏర్పడి వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. నిత్యం రద్దీగా ఉండే పొట్టిశ్రీరాములు కూడలి వద్ద మ్యాన్‌హోల్‌ను విడిచి పెట్టారన్నారు. వీటిని సరిచేయడంలో అలసత్వం వహిస్తే ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈయన వెంట ఎ.దాలినాయుడు, డి.రాంబాబు, సంతోష్ ఉన్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి



సూర్యారావు

శ్రీకాకుళం లీగల్: న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు అన్నారు. న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు ఇస్తున్న ప్రోత్సాహకాన్ని రూ.5 నుంచి రూ.పది వేలుకు పెంచాలని కోరారు. సత్వర పరిష్కారం కావాలంటే కోర్టుల్లో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఉత్తరాంధ్రలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్నారు.

'ఆసరా' ద్వారా న్యాయ సహాయం



గంజి ఎజ్రా

శ్రీకాకుళం లీగల్ : ఆసరా ద్వారా 9 రాష్ట్రాల నుంచి 275 వినియోగదారుల కేసులు పరిష్కరించామని ఆసరా జిల్లా అధ్యక్షులు గంజి ఎజ్రా తెలిపారు. న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ రెండు వేలు అవగాహనా సదస్సులు నిర్వహించా మని, మధ్యవర్తితత్వం ద్వారా 10,300 కేసులు పరిష్కరించామని అన్నారు. భవిష్యత్‌లో ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలి పెద్ద ఎత్తేన కేసులు పరిష్కరిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

కార్మిక చట్టాలపై అవగాహన

టెక్కలి : పలు రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులు తమ హక్కుల పరిరక్షణలో ముందజలో ఉండాలని, కార్మిక సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన చట్టాలపై అవగాహన పెంచుకుని వినియోగించుకోవాలని టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు న్నారు. స్థానిక రవీంద్రభారతి పాఠశాల ఆవరణలో మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యాన శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు తమ హక్కులను కాపాడుకునే క్రమంలో ఏమైనా లోటుపాట్లయితే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలన్నారు. దీనిపై ఉచితంగా న్యాయం అందించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. సమావేశంలో టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయవాదులు దవళ రాజేశ్వరరావు, కార్మిక శాఖాధికారులు జి.ఎల్లాజీరావు, ఆర్.రాధాకుమారి, సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, కోల్లి ఎల్లయ్య, టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ, న్యాయవాదులు పొట్నూరు ఆనందరావు, పి.మధుబాబు పాల్గొన్నారు.

పలాసలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నిరసనల మూడో రోజూ కొనసాగింది. అందులో భాగంగా జిల్లాలో పలు నియోజకవర్గ కేంద్రాల్లో 'బాబుతో నేను తోడుగా.. నియంతపై పోరాటానికి మేము సైతం' పేరిట నిరాహార దీక్షలను శుక్రవారం చేపట్టారు.

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా కాశీబుగ్గలో చేపట్టిన రిలే నిరాహార దీక్షను కాశీబుగ్గ పోలీసులు భగ్నం చేసిన సమయంలో శుక్రవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ మంత్రి గౌతు శివాజీను పోలీసులు ఈడ్చుకొని వెళ్లి పోలీస్ వ్యాన్‌లోకి ఎక్కించగా టిడిపి కార్యకర్తలు పోలీస్ వ్యాన్‌కు అడ్డంగా నిల్చొని అడ్డుకున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టి శివాజీని తరలించుకుపోయారు. అయితే ఆయనను ఎక్కడకు తీసుకువెళ్లిందీ సమాచారం ఇవ్వకపోవడంతో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. ఓ ప్రయివేటు వ్యక్తుల స్థలంలో శివాజీ సతీమణి విజయలక్ష్మి రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. దీక్షలో శిరీష, మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి, మాజీ ఎంపిపి దువ్వాడ కృష్ణమూర్తినాయుడు, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కష్ణారావు పాల్గొన్నారు. 11 గంటల సమయంలో దీక్ష వద్దకు కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరావురెడ్డి, కాశీబుగ్గ రూరల్ సిఐ శంకరరావు, పలు స్టేషన్ల నుంచి వచ్చిన ఎస్‌ఐలు చేరుకొని టిడిపి నాయకులు, కార్యకర్తలను ఇష్టానుసారంగా ఈడ్చుకుంటూ వ్యాన్‌లో ఎక్కించి కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో శిరీష పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎందుకు అరెస్టు చేసేస్తున్నారని చెప్పాలంటూ పోలీసుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శివాజీను అరెస్ట్ చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో టిడిపి శ్రేణులు అడ్డుకున్నారు. చివరకు కుర్చీలో కూర్చుని ఉన్న శివాజీను అమాంతంగా ఎత్తుకొని పోలీస్ వ్యాన్‌లోకి ఎక్కించి తీసుకు వెళుతున్న సమయంలోఅడ్డుపడి నిరసన తెలిపారు. వ్యాన్ వెళ్లకుండా సుమారు అరగంట పాటు అడ్డుకోవడంతో రోడ్డుపై వాహనాలు బారులుదీరాయి. చివరకు అతికష్టం మీద శివాజీను వ్యాన్‌లో తరలించారు. దీంతో శిరీష, బాబూరావు, విఠల్‌రావు, టిడిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కెటి రోడ్డు మీదుగా ర్యాలీ చేపట్టి కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఇంతలో గౌతు శివాజీ అస్వస్థతకు గురయ్యారని, కాశీబుగ్గ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారని ప్రచారం జరగడంతో విషయం తెలుసుకున్న ఆమె కుమార్తె శిరీష ఆస్పత్రులకు వెళ్లి చూసినా శివాజీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆగ్రహంతో కాశీబుగ్గ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని కాశీబుగ్గ రూరల్ సిఐ శంకరరావుని నిలదీశారు. తన తండ్రికి ఏమైనా జరిగితే పరిస్థితి వేరేలా ఉంటుందని పోలీసులను హెచ్చరించారు. తన తండ్రి ఆచూకీ చెప్పే వరకూ వెళ్లేది లేదని పోలీసుస్టేషన్ వద్ద ధర్నా చేస్తూ నిరాహార దీక్ష కొనసాగించారు. ఒకానొకదశలో శిరీష కన్నీటిపర్యంతమయ్యారు. చివరకు పోలీసులు సోంపేటలోని తన స్వగృహంలో శివాజీను విడిచి పెట్టారు. ఇంట్లోకి వెళ్లలేక స్పృహ కోల్పోయి ఇంటి వరండాలోనే పడిపోయారు. ఆయనతోపాటు ఉన్న కానిస్టేబుల్ స్థానిక వైద్యులను రప్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అతని స్వగృహంలో స్థానిక పోలీసులు గృహ నిర్బంధం చేశారు. శాంతిభద్రతల సమస్య దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. దీక్ష చేపట్టేందుకు వేరే ప్రదేశంలో తమకు అనుమతి ఇవ్వాలని, అనుమతి ఇచ్చే వరకు కాశీబుగ్గ పోలీసు స్టేషన్ వద్ద దీక్ష చేపడతామని గౌతు శిరీష అనడంతో దీక్ష చేసుకొనేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు

టిడిపి కార్యకర్తకు అస్వస్థత

మండలంలోని మోదుగులపుట్టి గ్రామానికి చెందిన అవుగాన షణ్ముఖరావు అస్వస్థతకు గురయ్యారు. తోపులాటలో ఊపిరి ఆడక అస్వస్థతకు గురయ్యారు. కొంత సమయం వరకు దీక్ష శిబిరంలో ఆయన్ని టిడిపి నాయకులు కార్యకర్తలు సపర్యలు చేసి ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

శ్రీకాకుళం నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన 'మేము సైతం బాబుకు తోడు' అన్న నినాదంతో దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జిల్లా నాయకులు ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, ఎస్.వి.రమణ, సింతు సుధాకర్, పి.ఎం.జె.బాబు పాల్గొన్నారు.

హిరమండలం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యాన టిడిపి నాయకులు మామిడి



పలాస : గౌతు శివాజీని అరెస్టు చేస్తున్న పోలీసులు

గోవిందరావు అభిమానులు ఎంజిఆర్ క్యాంప్ కార్యాలయం వద్ద నిరాహారదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, చవితిసిది మాజీ సర్పంచ్ మిర్యాబిల్లి భగవాన్‌దాస్, గానే సంజీవరావు, కలిశెట్టి వేణుగోపాలరావు, సాసుపల్లి దాలరాజు, పైల శాంతారావు, ధనుంజయ, రవి పాల్గొన్నారు.

పోలాకి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు ఆధ్వర్యాన చేపట్టిన దీక్షకు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో లుకలాపు రాంబాబు, భైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు, డోల ప్రసాదరావు, సూరపు నారాయణదాసు పాల్గొన్నారు.

ఆమదాలవలస టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహారదీక్షలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, బూర్జ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు వావిలపల్లి రాంజీ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పీరుకట్ల సీతబాబు, లంక జగన్నాథనాయుడు, పీరుకట్ల ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం పట్టణంలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు మూడో రోజు కూడా విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనతో ప్రజల జీవన విధానం అస్తవ్యస్తంగా తయారు చేస్తున్న జగన్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తాం అని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మణి చంద్ర ప్రకాష్, సంతోష్, సీపాన వెంకట రమణ, పొందల కష్ణారావు, కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం టిడిపి నేతలు పాల్గొన్నారు.

లాలాపేటలోని జామియా మసీదులో టిడిపి నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి నేత మహమ్మద్ జిలానీ ఆధ్వర్యంలో మత పెద్దలతో అల్లాను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దక్కత ఢిల్లీరావు, ఆశి లీలారాణి, డి. కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ఆవరణలో సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వైద్యానికి ప్రాధాన్యం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజా వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన రూ. 5.75 కోట్ల అంచనాలతో 3.11 ఎకరాల విస్తీర్ణంలో ఎపిఎంఎస్‌ఐడిసి ఆధ్వర్యాన నిర్మించనున్న 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి వైద్య సేవలలో తేడాను ప్రజలే గుర్తించాలన్నారు. ఇప్పటికే పట్టణంలో మెట్టక్కివలస, మోనింగి వారి వీధుల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు అన్ని హంగులతో నిర్మించామని అన్నారు. ఆయా హెల్త్ సెంటర్లకు తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఇందువతి ఛారిటబుల్



మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ట్రస్టు తరపున ఒక్కొక్కటి చొప్పున ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను పంపిణీ చేశామని తెలిపారు. పట్టణ శివారున జొన్నవలసలో ఉన్న పిహెచ్‌సిని మున్సిపాలిటీ పరిధిలోని మార్చామని అన్నారు. సూపర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి ధీటుగా ప్రభుత్వాస్పత్రులను తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, శిల్లా మల్లి, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, గురుగుబెల్లి నీలారావు, దుంపల శ్యామలరావు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

వజ్రపుకొత్తూరు : గ్రామాల్లో ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ... సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని దేవునల్తాడలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ గ్రామంలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమకు నేరుగా చెప్పాలని కోరారు. గ్రామ ప్రజలకు ఎంతో అవసరమైన వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లీనిక్ ప్రారంభించి ప్రజలకు అంకితం చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరధరాజు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, ఎంపిటిసి వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు గురయ్యానాయుడు, పలాస ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, పలాస మండలం అధ్యక్షులు పైల చిట్టిబాబు, పలాస ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మందస ఎంపిపి డొక్కరి దానయ్య పాల్గొన్నారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల అంపైర్‌గా శరత్



శరత్

కవిటి: హైదరాబాదులోని గుత్తా జ్వాల అకాడమీలో ఈనెల 15 నుంచి 19 వరకు జరగనున్న జాతీయస్థాయి అండర్-15, 17 బాల బాలికల బ్యాట్మెంటన్ పోటీలకు ఉషోదయ బ్యాడ్మింటన్ సంఘం సభ్యుడు తుంగాన శరత్‌ను అంపైర్‌గా నియమిం చినట్టు రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుంచి ఉత్తర్వులు అందాయని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తమరాల జయరాం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా శరత్ ఎంపికకు కృషి చేసిన జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, కార్యదర్శి మెట్ట అశోక్, సిఇఒ సంపతిరావు సూరిబాబు, సీనియర్ ఉపాధ్యక్షుడు భైరి దామోదర్, స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, బ్యాట్మెంటన్ అసోసియేషన్ సభ్యులు లోల్ల రాజేష్, బెందాలం రమేష్, బల్లెడ రవి, బిపి జయదేవ్, ఉషోదయ యువజన సంఘం సభ్యులు ఆరింగి మధు, పాండావ చంద్రశేఖర్, పొల్లాయి లక్ష్మణమూర్తి, వజ్జ రంగారావు శుభాకాంక్షలు తెలియజేశారు.

డ్వామా పీడీ పరిశీలన

టెక్కలి రూరల్ : మండలంలో కొణుసులకొత్తూరు గ్రామంలో చేపడుతున్న అమృత్ సరోవర్ పనులను డ్వామా పీడీ చిట్టి రాజు శుక్రవారం పరిశీలించారు. దాతల సహకారంతో చెరువుగట్టుపై బెంచీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎపిడి సునీత, ఎపిఒ బగాది ప్రసాదరావు. పంచాయతీ కార్యదర్శి. కలిశెట్టి చంద్ర రావు. సర్పంచ్ మొర్రి శంకరరావు, వైసిపి నేతలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

అర్హులైన దళితులకు జగనన్న కాలనీ ఇళ్లు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అర్హులైన దళితులకు జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరు చేసేందుకు అవకాశముందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కమిటీ సభ్యులు కంఠ వేణు మాట్లాడుతూ అంపోలు వద్ద ఎస్‌సి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాన్ని కేటాయించాలన్నారు. దీనిపై జెసి స్పందిస్తూ అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. బోసు మన్మథరావు మాట్లాడుతూ మాదిగలకు కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయించాలని కోరారు. టెక్కలి మండలంలో దళితులకు ఇచ్చిన భూములు ఆక్రమణలకు గురయ్యాయని సభ్యులు చిరంజీవి ప్రస్తావించగా, విచారణ చేపడతామని జెసి హామీనిచ్చారు. సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో అపరిశుభ్రత కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని చిరంజీవి ప్రస్తావించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వై.విశ్వమోహన్ రెడ్డిని జెసి ఆదేశించారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎఎస్‌పి జి.తిప్పేస్వామి, ఆర్‌డిఒలు సీతారామ్మూర్తి, బి.శాంతి, ఎపిపి ఎం.మల్లేశ్వరరావు, డిఎస్‌పిలు డి.విజయ్ కుమార్, బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : పేదలకిచ్చే పింఛన్ల ద్వారా లబ్ధిదారులకు సామాజిక భద్రత లభిస్తుందని, ప్రతినెలా 1న పింఛను అందుకున్న లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూస్తున్నామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం పంచాయతీలో 56 మందికి నూతన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. వాలంటీర్లు సక్రమంగా పింఛన్లను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వినియోగించుకుని జీవన ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. వైసిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి ప్రకాశరావు, సింగుపురం సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, ఎంపిటిసిలు నక్క శంకర్, బగ్గు అప్పారావు, వైసిపి నాయకులు రంధి రాజారావు, మాజీ సర్పంచ్ గుండ మోహన్ పాల్గొన్నారు.

జలుమూరు : అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎంపిపి వాన గోపి అన్నారు. శుక్రవారం శ్రీముఖలింగంలో నూతన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు, సర్పంచ్ టి. సతీష్ కుమార్, ఎంపిటిసి కరుకోల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : జగన్నాథపురం పంచాయతీలో ప్రభుత్వం మంజూరు చేసిన రెండో విడత కొత్త పెన్షన్లను శుక్ర వారం లబ్ధిదారులకు సర్పంచ్ జోగి రాములమ్మ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు పుక్కళ్ల లక్ష్మణ రావు, వాలంటీర్లు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : పింఛను కార్డును అందజేస్తున్న సర్పంచ్ రాములమ్మ


విద్యార్థులను విచారణ చేస్తున్న ఆర్‌జెడి శోభారాణి

ఫిర్యాదులపై ఆర్‌జెడి విచారణ

పొందూరు : పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంపై ఆర్‌జెడి ఎస్.శోభారాణి శుక్రవారం విచారణ చేపట్టారు. కళాశాలలో ఫీజులు వసూలు చేసి రశీదులు ఇవ్వడం లేదని, ఫీజులు చెల్లించినా మళ్లీ చెల్లించాలంటూ వేధిస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ డి.రామారావు కళాశాలకు సక్రమంగా హాజరు కావడం లేదని, కళాశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ చెప్పారు. దీంతో ఆర్‌జెడి కళాశాలను సందర్శించి ప్రిన్సిపాల్‌ను, విద్యార్థులను, బోధన, బోధనేతర సిబ్బందిని విచారించారు. ఇక్కడ ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలను షిఫ్ట్ పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు చేపట్టిన విచారణపై పలు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

సిఎంను కలిసిన బిఆర్‌ఎయు విసి

వర్శిటీ భవనాల ప్రారంభానికి ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం


పుష్పగుచ్ఛం అందజేస్తున్న విసి

కొత్తగా విజయనగరంలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి శుక్రవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ యూనిర్శిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు హెలిపాడ్ వద్ద కలిశారు. ఈ సందర్భంగా యూనివర్శిటీలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ బాలుర వసతి గృహం, పరిపాలనా భవనం ప్రారంభోత్సవానికి రావల్సిందిగా వినతి పత్రం సమర్పించారు. ఈ హాస్టళ్ల వల్ల 325 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం లభించనుందని, పరిపాలనా భవనం ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. యూనివర్శిటీకు కొత్తగా 109 పోస్టులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

సిఎంను కలిసిన ఎమ్మెల్యే

రణస్థలం : విజయనగరంలో మెడికల్ కాలేజీ ప్రారంభించిన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌ని రెడ్డిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ మేరకు నియోజకవర్గంలో సమస్యలు, రాజకీయ అంశాలను వివరించారు.

అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి

పోలాకి : అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలు చదువుతోపాటు ఆరోగ్యా నికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు అన్నారు. శుక్రవారం చీడివలస, జిల్లేడువలస, మాకివలస కేంద్రాలను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం ఏవిధంగా పంపిణీ చేస్తున్నారనే అంశాలను పరిశీలించారు. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సేవలు అందించాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలకు రెండు జతలు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటాలో అక్షయకి మెడికల్ సీట్

శ్రీకాకుళం: ఫెన్సింగ్ క్రీడలో రాణించిన జిల్లాకు చెందిన గురుగుబెల్లి అక్షయకి స్పోర్ట్స్ కోటాలో గుంటూరు మెడికల్ కాలేజ్‌లో సీటు దక్కించుకుంది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ రెండో విడత సీట్ల కేటాయింపు జాబితాను ప్రకటించింది. అక్షయ కొన్నేళ్లుగా ఫెన్సింగ్ క్రీడలో టౌన్ హాల్ కేంద్రంగా ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ శిక్షణలో శిక్షణను పొందింది. జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్లోనే కాకుండా రాష్ట్రస్థాయిలో పలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని సత్తా చాటింది. అక్షయకి స్పోర్ట్స్ కోటాలో మెడికల్ సీటు దక్కడంపై ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు వైశ్యరాజు మోహన్, బల భద్రుని రాజా, జి.వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులందరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. రిజర్వు బ్యాంకు ఆదేశానుసారం, యూనియన్ బ్యాంకు వారి సౌజన్యంతో బొబ్బిలిపేటలో కళాజాతా బృందం శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు, మహిళలు బ్యాంకు లావాదేవీలు జరుపునప్పుడు, ఎటిఎం కార్డులను ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించామని అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ... టోల్ ఫ్రీ నంబరు 1930కు కాల్ చేసి సమస్యను తెలియపర్చాలని సూచించారు. బ్యాంకుల్లో అమలవుతున్న ఇన్సూరెన్స్ పథకాల గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో సిఎఫ్ఎల్ సిబ్బంది సిహెచ్.వెంకటేష్, రామారావు, వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుభద్ర, శృతి, స్వర్ణలత, ఈశ్వరమ్మ, రాజు, కళ్యాణి పాల్గొన్నారు.

'ముంపు' పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

వంశధార వరద ముంపు పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ నాయకులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వరద ముంపు ప్రాంతాలైన మదనపురం, ఆకులతంపర, సోమరాజపురంలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రంలో వర్షాలు పడటంతో వంశధారకు వరదలు రావడం పరిపాటిగా మారిందని, వరదలు వచ్చే ముందు ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద కట్టల నిర్మాణం చేసి వరద ముంపు నుంచి విముక్తి చేయాలన్నారు. సుమారు 300 ఎకరాలు వరకు వరి, చెరకు, అరటి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. నివగాం నుంచి ఆకులతంపర వరకు వెళ్లే రహదారి పూర్తిగా పాడైందని, రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.కిరణ్ ఉన్నారు.


ముంపునకు గురైన పంటను పరిశీలిస్తున్న ప్రసాద్

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ


ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

ఇచ్ఛాపురం : ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం బెల్లుపడ కాలనీ 2, తురక వీధి సచివాలయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వార్డ్ వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రత్యేకమైందని, ఇంటి వద్దకే వైద్యం తీసుకువచ్చిన ఘనత జగన్‌కు దక్కుతోందన్నారు. ఎఎన్ఎంలు వచ్చే సమయానికి ఇంట్లో సభ్యులందరూ ఉన్నట్లయితే ఆరోగ్య విషయాలు తెలుసుకోవడం సులభం అవుతుందన్నారు. ఆరోగ్య సురక్ష సిటిజెన్ ఆప్‌ను ప్రతి ఇంట్లో సభ్యులకు చెప్పి డౌన్లోడ్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డ్ కౌన్సిలర్ మంజులత, సూపర్‌వైజర్ సుజాత, 11వ వార్డు ఇంచార్జి షఫీ ,5వ వార్డ్ ఇంచార్జి కిరణ్ కుమార్, మండల కో-ఆర్డినేటర్ సందీప్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మండల స్పెషల్ ఆఫీసర్ టి.భవానీశంకర్ శుక్రవారం సమీక్షించారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 25 వరకు జరగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తహశీల్దార్, ఎంపిడిఒ ఆధ్వర్యాన రెండు టీమ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఇఒపిఆర్‌డి టి.తారకేశ్వరి, డిటి శంకరరావు, ఎఒ తిరుపతి పట్నాయక్, వైద్యాధికారులు అనంతలక్ష్మి, గ్రీష్మ పాల్గొన్నారు.

కళాకారుడు మృతి

పలాస : మండలంలోని బొడ్డపాడుకు చెందిన పోతనపల్లి నాగేశ్వరరావు (50) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. శ్రామికజన ఉద్యమ గీతాలకు జానపద గేయాలకు రూపకల్పన చేసి అనేక వేదికలపై వందలాది ప్రదర్శనలు ఇచ్చిన ప్రజాకళాకారుడు మృతి చెందారు. అనేక మంది యువ కళాకారులకు మార్గదర్శకుడుగా నాగేశ్వరరావు అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో ఉద్దాన గ్రామాలకు తీరనిశోకం మిగిల్చింది. ఈయన బిలాయి, అండమాన్, ఒడిస్సా, చత్తీస్గఢ్ రాష్ట్రాల్లో తన గళం నృత్యంతో ప్రదర్శనలు ఇచ్చారు. మృతునికి భార్య మహాలక్ష్మి, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతిపై బొడ్డపాడు సర్పంచ్ తామాడ మధన్, తామాడ తిలోచనరావు, రామారావు, ఉదయకుమార్, ఉపాధ్యాయులు బి.ఓంకార్, చంద్రయ్యలు సంతాపం తెలిపారు.

అప్పలస్వామి రచనలు స్ఫూర్తిదాయకం

టెక్కలి : విజ్ఞానం అంతగా ప్రభావితం లేని రోజుల్లోనే సాహిత్యంపై మక్కువ పెంచుకుని 16 భాషల్లో ప్రావీణ్యం సాధించిన సాహిత్యమూర్తి ఆచార్య రోణంకి అప్పలస్వామి భౌతికంగా మన మధ్య లేకపోయినా... ఆయన రచనలు సజీవంగా ఉంటాయని సీనియర్ న్యాయవాది ఖజానా వెంకటరావు, మేధావుల పోరం సంఘ అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి మాస్టార్లు అన్నారు. పట్టణంలోని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సాహిత్య సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన శుక్రవారం అప్పస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు చెందిన అప్పలస్వామి రచనలు స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న దేవాది సునీత, జి.వెంకట విజయలక్ష్మిలను సన్మానించారు. అంతకుముందు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని అప్పలస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సాహిత్య సాంస్కృతిక సమాఖ్య టెక్కలిశాఖ కార్యదర్శి బొడ్డ ఆయ్యబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అప్పలస్వామి మనుమడు రోణంకి శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, డాక్టర్ ఎం.జగన్నాథరావు, విశ్రాంత ఉద్యోగులు ఆనిశెట్టి చిట్టెన్న, కోరాడ రాంప్రసాద్, దల్లి వీరాస్వామిరెడ్డి, ప్రధాన హరిశ్చంద్రరావు, కె.ధనుంజయరావు, దూసి ఆంధ్రా స్టాలిన్, హనుమంతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న రచయితలు

క్రీడాకారుల ఎంపిక

టెక్కలి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించనున్న జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు టెక్కలి నియోజకవర్గం నుంచి జిల్లా జట్టు ఎంపిక శుక్రవారం జరిగిందని కన్వీనర్ బాడాన నారాయణరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి నాగభూషణం ప్రారంభించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 45 పాఠశాలల నుంచి నూట నలభై మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరు కాగా, వీరిలో 48 మందిని ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన జట్టుని నాగభూషణం అభినందించారు. ఈ ఎంపికల్లో వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, కాపల రఘునాథరావు, కె.కె.రామిరెడ్డి, లక్ష్మణరాజా, కుప్పిలి ప్రకాష్, రమేష్, ఆదిశేషు, జగ్గమ్మ, జి.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, పాండవుల జగదీష్, బసవరాజు పాల్గొన్నారు.



ఎంపికైన జిల్లా జట్టు

వజ్రపుకొత్తూరు: ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పాలిన శ్రావణి అన్నారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.హరిబాబు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అండర్-14బి, 17 బాలబాలికల విభాగంలో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్ పి.తవిటయ్య, సిహెచ్.పద్మలోచన, ఎస్.రామారావు, చంద్రశేఖరరావు, పి.గజేంద్రరావు, సిహెచ్.రాంజీ, జి.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని సురంగి రాజా మైదానంలో నియోజకవర్గస్థాయి పాఠశాల క్రీడాకారుల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలకు నాలుగు మండలాల నుంచి 456 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, త్రో బాల్, బ్యాడ్మింటన్ క్రీడ అంశాల్లో ఎంపికలు చేపట్టారు. ఇందులో 204 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. మిగిలిన అథ్లెటిక్స్ క్రీడాంశాలు శనివారం నిర్వహిస్తారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం విశ్వనాథ్, నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త పద్మనాభం రెడ్డి, వజీర అహ్మద్, కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.